# ఆలీఫ్ బే తే మా నాయినమ్మకు గోరి కడితే

గౌస్‌జాన్ ఎనకింట్లోకి జెడ్‌పి ఉర్దయివోరు బాడిక్కి దిగినాడని తెలిసినాక మా యీది పిలకాయలకి కాళ్లూ చేతులూ ఆడలా. అల్మాస్ వాళ్లింటికాడ కుప్పబోసిన యినకలో ఎట్టా ఆడుకుంటున్నామో అట్టే కూచునేసిపోయాం- అదితెలిసి.

'యిప్పుడే ఐవోరొచ్చి టైరుబండ్లో సామాన్లు దించతా వుంటే చూసేసొస్తున్నా. రేపట్నించి ఆణ్ణే పర్‌వేట్ జెప్పించుకో వాలంట. ఉర్దూ గూడా నేర్చుకోవాలంట. మా అమ్మ జెప్పింది' అన్నాడు గౌస్‌జాన్ కొడుకు సందాని- నిండా నీళ్లు దిగిపోయిన ముకంతో. పోయి పోయి పక్కింట్లోనే పర్‌వేట్ పీడ దాపురించిదేమిరా నాయినా అని వాడికి బయమెత్తుకునేసింది.

ఉర్దూ మాటెత్తే సరికి మా షమ్మీ గూడా అదిరిపడింది.

'యిప్పుడెట్రా? మా అమ్మగూడా పంపిస్తుందేమో పీడ' అందా పిల్ల బితుకుబితుకుమంటా. మా నాయినమ్మ పుణ్యమా అని ఆ పిల్లకి ఉర్దూ పాఠమంటే హడలు.

షమ్మీది మా ఎదురిల్లు. వాళ్ల నాయిన లారీ డ్రయివరు అహ్మద్‌బాష. ఆ పిల్ల పొద్దుగూకులా నాతో ఆడుకోవడానికి మా యింటికొస్తా వుండేసరికి మా నాయినమ్మ సైగ్గా దాని మింద కన్నేసింది.

కూరలోకి అల్లం ముక్క అడగడానికి వొచ్చిన వాళ్లమ్మ ఖుర్షీద్‌బీని నిలేసి-'ఆడపిల్లకి నాలుగు ఉర్దూ ముక్కలైనా జెప్పకుండా నీ కూతుర్ని యీ దోవన పెంచతుండావే. నీకేమైనా బుద్దుందంటమే! రేపది (పెళ్లయి) ఎళ్లిన చోట అందరూ ముక్కున ఏలేసు కోరా? ఉర్దూ రానందుకు ఊయరా?' అని బెదరగొట్టి, లటక్కున షమ్మీనేసుకునేసింది మా నాయినమ్మ.

ఆనేక మా నాయినకు డావేసింది.

'రే అబయా... నీకూ ఈ మనిషికి (మా అమ్మను జూపిస్తా) కోస్తే ఒక ముక్కయినా ఉర్దూ రాదుగదా... ఈ నా బట్టల్ని గూడా మీ సరిగానే పెంచతార్రా? యిప్పడికే యింట్లో ఒక నమాజులా. ఒక ఖురానులా. ఫాతెహా చేయడమన్నా నేర్చుకోమ్మా తల్లా అంటే యీ మనిషికి అదీ రాకపాయా. ఉర్దూ అరబీలను నాతోనే ఆఖరు చేస్తావేందిరా?' అని యాక్షన్లు జేసి మా అన్ననూ నన్నూ చేజిక్కించుకుంది.

యింక జూసుకో.

సాయింత్రం మగ్‌రీబ్ నమాజయిపోయినాక మా ముస్గర్నీ మా నాయినమ్మ పట్టుకోవడం- తలల మింద చేలిగుడ్డో టోపీలో పరవడం- అలీఫ్, బే, తేలు జెప్పడం- అవి చూడకుండా రాసేంతదాక వేళ్లు మెలేసి చుమ్టాలుబెట్టడం... యిదే దరువు. (చుమ్టాలంటే మిఠాయనుకునేరు. తొడపాశం నాయినా)

షమ్మీ అసలికే మొద్దుముండ. అలీఫ్, బే,తేలు రాక... మా నాయినమ్మ చుమ్టాలను సయించలేక కింద తొడ ఎర్రంగా కందిపోతా వుంటే పైన కళ్లనిండుగా నీళ్లుబెట్టుకునేది.

ఆ కదుపుమంట తీర్చుకోవడానికి అందరం ఆడుకుంటున్నప్పుడల్లా 'అలీఫ్, బే,తే... మీ నాయినమ్మకు గోరి కడితే' అని పాడతా వుండేదా పిల్ల.

నాకేమైనా తక్కువ కదుపు మంట వుంటేగదా. నేను గూడా అందుకునేది- 'అలీఫ్,బే,తే... మా నాయినమ్మ గోరి కడితే' అని.



కొన్నాళ్లకు యిస్కూల్లో అర్దంగాని ఇంగిలీషు-తెలుగు బాద, ఇంట్లో మా నాయినమ్మ ఉర్దూబాద ఎక్కువయిపోయేసరికి, యింకిట్టగాదని వాళ్లమ్మకు ఏం జెప్పకుండో ఏమో ముంగమూరులోని వాళ్లక్కింటికి ఉడాయించేసింది షమ్మీ. పది రోజులు రానేలా. నేనుగూడా సైగ్గా యూనిట్ టెస్టులు ఉండాయని జెప్పి సాయంత్రమైతే చాలు ఇంగిలీషు పుస్తకం ముందరబెట్టుకొని 'రామయ్య- ద కాబలర్' చదవతా కూచునేవాణ్ణి. మా అన్నయితే 'పోపోమ్మే... నీ బేకార్ వుర్దూ ఎవరు నేర్చుకుంటారా?' అని పూర్తిగా అడ్డం తిరుక్కునేసినాడు.

నా నాయినమ్మ యిసిగిపోయి 'పోంద్రా నా బట్టల్లారా. మీ ఖర్మాన మీరేబోతారు' అని వొదిలేసింది మమ్మల్ని.

అట్టా బతికి బయటపడ్డ మేము మళ్లా యిప్పుడు ఉర్దయివోరు గండాన్ని ఎట్టా తప్పించుకోవాల్రా సామీ? అని ప్లానల్లోబడ్డాం.

'యీ ఐవోరు బెత్తం పట్టుకుంటే వొదలడంట నాయినా. ఈ సంగతెలిసే మా అన్న ఆర్లో ఉర్దూకు బొదులు తెలుగు తీసుకున్నాడంట' అని యింకాస్త దడిపించినాడు ఖలందర్.

దాంతో యింకిప్పటికిప్పుడు ప్లానేయక తప్పదని అర్థమయిపోయింది మా అందరికీ.

'తత్తాయ్... ఐడియా' అన్నాడు గౌస్‌జాన్ కొడుకు సందాని.

'ఏందిరా... ఏందిరా?' అని అడిగాం అందరం.

'జాఫర్ ఐవోరు. యిజ్‌డమ్ టుటోరియల్స్' అన్నాడు, చిటికేస్తా.

అందరం సప్పంగా సల్లబడిపోయినాం.

'ఏడ్చినావులే. ఆడ బాగజెప్పరనే గదరా మనం పర్‌వేట్ జేరసిది. అదీగాక నెలకు పదిరూపాయిలంట ఫీజు' అన్నాడు ఖలందర్.

'ఫీజు పెచ్చయితే ఏమిరా? కొట్టకుండా జెప్తారంట. మద్యలో ఎగనూకినా ఏమీ అనరంట' అన్నాడు సందాని.

'అవున్రా. ఉర్దయివోరు పీడకన్నా యిజ్‌డమే మేలు' అని సందానితట్టే మాట్లాడింది షమ్మీ.

నేను గూడా సరేనన్నా.

వెంటనే అందరం పిర్రలకంటిన యినకను యిదిలించుకుంటా లేచి, యిళ్లకుబోయి 'ఎందుకు? ఏమిటికి?' ఒనే సవాలుకు చాన్సివ్వకుండా 'జాఫర యివోరి పర్‌వేట్ జేరుతున్నామ'ని జెప్పి ఆగమేఘాల మింద చేరిపోయాం.

ఉర్దూ జోలికే పోని ఆ పనికిమాలిన పర్‌వేట్ చేరినాకగానీ మా అందరికీ ఉర్దూ పీడ శాశ్వతంగా - యిరగడైపోయింది.

ఆ తర్వాత యిప్పటి వరకూ గూడా ఉర్దూ నేర్చుకోలేదనిగానీ అరబీ రాదనిగానీ తెలుగులో తప్పితే ఆ భాషల్లోని ఖురాన్ని కనీసం తాకనుగూడా తాకలేకపోయాననిగానీ సాయిబు పుటకబుట్టి ఫాతేహా దరూద్‌లు నేర్చుకోలేదని గానీ నేను యింతంటే యింతగూడా బాద పళ్లా.

కానీ యిన్నేళ్ల తర్వాత హైద్రబాద్ ప్రెస్‌క్లబ్‌లో, ఇరానీ హోటళ్లలో పరిచయమై, సిగరెట్లు వూదుకుంటా, చాయ్‌లు లాల్చీల మింద ఒలకబోసుకుంటా కతలు కవిత్వాలు జెప్పే షోదా నా కొడుకులంతా 'నీకు మగ్దూమ్ తెలుసా? ఫయాజ్ అహ్మద్ ఫయాజ్ తెలుసా? జీలానీ బానో తెలుసా? సిరాజుద్దీన్ మౌలా తెలుసా? మాకెట్టా ఆ బాగ్యం లేదు. నువ్ గూడా ఉర్దూలో ఏమి కవిత్వం మిస్సయిపోయావుబాస్' అంటా జాలి పడతా వుంటే ఆనాడు బతిమాలో బామాలో తేనెలాంటి ఆ బాషను నేర్పనందుకు మా నాయినమ్మకు నిజ్జంగానే గోరి కట్టాలనిపించింది.

-మహమ్మద్ ఖదీర్‌బాబు